

# కక్కుర్తి

విశ్వనాథ పావని శాస్త్రి

ఆఫీసులో గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాను. సీలమండల మీద ఏదో దురదగా ఉంది. కొంచెం గోకాను. వెచ్చగా ఉంది. మళ్ళీ గోకాను. ఇంకా వెచ్చగా ఉంది. అంతే! గోళ్ళు గిల్లుకోవడం మానేసి గోకుతూ కూర్చున్నాను. గోకినకొద్దీ వెచ్చగా ఉంది. వెచ్చగా వున్నకొద్దీ గోకుతున్నాను. ఈ "బ్రహ్మానందం" యిలా అనవరతంగా సాగుతూండగా "తొలి సంకల్ప నికారం" అల్లే ఆఫీసు గడియారం టంగు టంగున మ్రోగసాగింది. ఒకసారి గడియారంకేసి దృష్టి సారించి మళ్ళీ కాలికేసి తల తిప్పాను "అమ్మబాబోయ్. కాలి మీద ఏదో పుండు!" మధ్యక్కోసిన బీట్రూట్ దుంపలాగాఉంది. అమాంతం సీటులోంచి అదృశ్యమైపోయి, మా డాక్టరు బావ ప్రకాశం దగ్గర ప్రత్యక్షమయ్యాను.

"ఏమిటి! యిలా తగలడ్డావ్?"అన్నాడు వాడు.

"నేను కాదు తగలడింది-నాకాలు-చూడు" అంటూ పాదం ఎత్తి వాడి టేబుల్ మీద పెట్టాను. వాడు కాస్సేపు దానికేసి పరీక్షగా చూసి "నా నెత్తిమీద పెట్టబోయినావ్!" అన్నాడు. "అలాగే" అంటూ నేను ఆ పాదం మరికాస్త ఎత్తి త్రివిక్రముణ్ణి అవబోయేంతలో "ఆగక్కడ"అంటూ వాడొక అరుపు అరిచి. శ్రీనాథ సీసమో, విశ్వనాథ శార్దూలమో. నా శ్రాద్ధమో ఏదో ఓ పద్య భాగం చదివాడు.

నాకు దురదగా ఉండి మళ్ళీ గోకుతూ, "సాహిత్యం ఎప్పటినుంచి ఏడుస్తున్నావ్" అని అడిగాను.

వాడు, "గోకకు" అంటూ నా చెయ్యి ఒక్క గుంజు గుంజి "సాహిత్యం ఏమిటి నీ బొంద" అన్నాడు.

"మరి యిప్పుడు నువు చదివిన ఆ శ్లోకం ఏమిటిట?" అని అడిగాను.

"అదా? అది శ్లోకం కాదు. నీకొచ్చిన చర్మరోగం చిట్టి తండ్రి: దాన్ని "లాటిన్"లో అలా పిలుస్తారులే." అన్నాడు. నాకు లాఠీలతో కొట్టినట్లయ్యింది.

భోరుమంటూ వాడి మీద పడిపోయి, "అంతపెద్ద రోగమా"అని వెక్కసాగాను.

వాడు, "ఛీఛీఛీ! వెధవా!లేలే! చొక్కా తడిపేస్తున్నావ్" అంటూ కసురుకుని. "ప్రస్తుతం అంత పెద్దది కాదు. నువ్వు అశ్రద్ధ చేస్తే అవుతుంది" అని ఆప్యాయంగా అని, ఓ చీటీ మీద ఏదో బరికేసి నాకిస్తూ, "దార్లో ఈ ట్యూబు కొనుక్కుని యింటికెళ్ళి రాసి పడుకో. ఇవ్వాళే మొదలెట్టు. రోజూ రెండు పూటలా రాయి. అయిదారు నెలలు వాడితే గాని తగ్గదిది. ఇది కొంచెం ఖరీదు. ఈ సారికి కక్కుర్తిపడక కొనుక్కో. నా దగ్గర "శాంపిల్స్" అయిపోయినాయ్: సోమవారం వస్తాయి! యిస్తాను. ఈ లోగా అశ్రద్ధ చేసి ఛావకు. రోగం పెరిగిచస్తుంది. తర్వాత వస్తావ్. పో"" అని ఏకబిగిన నా చెవులలో అరిచేసి. ఓ గ్లాసు మంచినీళ్ళు తాగి, నాకేసి చూసి, "ఏమిటి! యింకా యిక్కడే తగలడ్డావా? పోపో! ముందు. అన్నట్టు ఆగు! మా ఆవిడ రాత్రికి ఊరు వెళ్తోంది. ఎల్లుండొస్తుంది. రేపు నేను మీ యింట్లోనే భోజనం. మా చెల్లాయితో చెప్పు. ఏ చెల్లాయ్‌తో చెప్తావ్! నాకు ముగ్గురు చెల్లెళ్ళున్నారు- మీ ఆవిడతో చెప్పు. పోఫో" అంటూ నన్ను తరిమేసి "నెక్ట్స్"అని కేకేసాడు. వెధవ ప్రాక్టీసూ వీడూనువెధవ!కొంపలంటుకుపోతున్నట్టే!

దార్లో ఓ మెడికల్‌షాపు దగ్గరాగి, వాడు బరికిన చీటీ చూపించాను. షాపువాడు ఓ చిన్న ప్యాకెట్టు టేబుల్ మీదికి విసురుతూ దాని ధర చిన్నగా అరిచాడు- నా గుండె చెరువైపోయింది ఆ ధర విని. పోనీ సోమవారందాకా ఆగుదామా అనిపించింది. ఇంతలో "కక్కుర్తిపడి ఛావకు. రోగం పెరిగి చస్తుంది. తర్వాత వస్తావ్" అంటూ మా ప్రకాశంగాడి అరుపులు చెవులో గింగురుమన్నాయి. ఉలిక్కిపడి భారంగా చెయ్యి జేబులోకి పోనిచ్చాను. ఈ లోగా ఆ మందుపెట్టెమీద, కంద సంపాదకుడి బందసంతకం అల్లే ఆ మందు తయారుచేసే కంపెనీపేరు కనబడింది. జేబులోకి వెడుతున్న చెయ్యి "ఫ్లయింగ్ సాసర్" అల్లే బయటికొచ్చేసింది.

ఔను: రామకృష్ణ ఈ కంపెనీలోనే కదా మెడికల్ రిప్రజెంటేటివ్! వాడిదగ్గర "ఫిజిషియన్స్ శాంపిల్స్" చాలా ఉంటాయి! ఓటి తీసుకుంటేపోలా-ఎందుహరికే యింత డబ్బు దండగ! అంతగా అయితే అప్పుడే వచ్చి కొనుక్కోవచ్చు-


"ఇప్పుడే వస్తా" అని షాపువాడితో చెప్పి రామకృష్ణ ఇంటికి పరిగెత్తాను. సరిగ్గా వాడూ అప్పుడే రిక్షా దిగుతున్నాడు. క్యాంపునుంచి వస్తున్నాట్ట! వాడు స్నానం చేసి బట్టలు మార్చుకుని బడలిక తీర్చుకుని ఇవన్నీ అయ్యేటప్పటికి చాలాసేపుపట్టింది. చివరికి వాడికి ప్రకాశం బరికిన చీటీ చూపించాను. వాడు ఆ కాగితం చిరిగిపోయేటట్లుగా, ఓ పెద్ద ఆంబోతల్లే నిట్టూర్చి "ఇదే కావల్సొచ్చిందా నీకు" అంటూ ఓ అరగంట ఆ సంచులూ, ఈ సంచులూ ఆ పెట్టెలూ ఈ పెట్టెలూ వెదికి చివరకి ఆ మందు పెట్టె ఒకటి తీసుకుని వచ్చి, "ఇదొక్కటుంది బాబాయ్ నీ అదృష్టం కొద్దీ. ఇది చాలా 'ఓల్డ్ ప్రోడక్ట్' మాది. 'శాంపిల్స్' ఎక్కువగా రావు. ఐనా నాల్గయిదు రోజుల్లో వస్తాయిలే! యిస్తాను. ఈ లోగా ఇది వాడుతూ ఉండు" అంటూ యిచ్చాడు.

వాడికో "థ్యాంక్స్" పారేసి, మరో అరగంట వాడితో ఊక దంపి, ఇంటికి బయల్దేరాను, ఆనందంగా.

రాత్రికి భోం చేసి మంచం ఎక్కి, ట్యూబు తీశాను రాద్దామని. తీరా పెట్టె లోంచి బయటికి తీస్తే, ఆ ట్యూబెంతుంది! మల్లెపువులో మంచు బిందువంత!

మెల్లిగా దాని మూత తీసి, దాని మూతి కుడిచేతి చూపుడు వేలిమీద ఆనించి, ఎడం చేత్తో ట్యూబు క్రింద మెల్లిగా నొక్కాను. ఆయింటుమెంటు రాలేదు. మరి కాస్త నొక్కాను. ఊఁహుఁ! మరికాస్త! ఊహుఁ! "వీడి కక్కుర్తి తగలెయ్య! సగమే నింపాడేమిటి ట్యూబు" అని అనుకుంటూ మరి కాస్త గట్టిగా వత్తాను. ఏముంది! "బుస్" మంటూ కాస్త గాలి, ఓ చిన్న బుడగ. అప్పటికే ట్యూబంతా అయిపోయింది. ఆ మెడ దగ్గర మాత్రం కాస్త మిగిలింది. ఒళ్ళు మండిపోయి రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని రాక్షసుడల్లే ఆ మెడ దగ్గర పిసికేశాను. అంతో యింతో కొంచెం ఉంటే అది బయటకి వస్తుందికదా అని.

అంతే! ఆ దెబ్బకి ఓ పెసర గింజంత ఆయింట్‌మెంటు సన్న తీగలాగా సాగి, "పుచుక్" మంటూ ఎగిరి, ప్రక్కనే టేబుల్ మీద తిరుగుతున్న "మోహిని ఫ్యాన్" లోకి వెళ్ళిపోయింది– అదికాస్తా, ఆ కాస్తనీ, గోడమీది దేవతలకి అమృతంలాగా పంచేసింది. ★



# పోయేకాలమ్ కథ

ప్రసన్నకుమార్ సర్రాజు

ముసలాయనకు ఒంట్లో నలతగావుంటే ఫ్యామిలీ డాక్టరు వచ్చి టెస్టులన్నీ చేశాడు. కొడుకులూ, కోడళ్ళూ ఆదుర్దా పడుతూ డాక్టరుగారిని సాభిప్రాయంగా చూస్తున్నారు– రిజల్ట్ ఏదైనా, రోగి దగ్గర చెప్పకుండా అసింటా ప్రక్కకు తీసికెళ్ళి చెప్తాడని.

ఆయన సినిమా డాక్టరు కాదు బంధువుల్ని పక్కకి తీసికెళ్ళి రోగి వినేట్లు పెద్దగా చెప్పడానికి. నిజం డాక్టరు. అందుకని అక్కడే చెప్పేశాడు: అది "కారాకెళ్ళి యోమియ" అని. అంటే ముసలాయనికి అత్యంత ప్రీతిపాత్రమైన కారా కిళ్ళీలు అదే పనిగా నవలడం వల్ల స్టమక్ అప్‌సెట్ అయిందని, వెంటనే మానెయ్యక పోతే అది అల్సర్‌కి దారితీయొచ్చని.

కొడుకులు కోడళ్ళు వెంటనే ముసలాయన్ని కట్టడిచేశారు. ప్రేమగా మందలించారు. కారా కిళ్ళీ జోలికెడితే ఊరుకోం అని ఆపేక్షగా కసిరారు, ఈ రోజు నుంచీ ఆయన కారా కిళ్ళీ వేసుకోకుండా చూసే బాధ్యత మాది అని డాక్టరుకి హామీ ఇచ్చారు. డాక్టరు సంతృప్తిగా వెళ్ళిపోయాడు.

ముసలాయనకి చాలా అభిమానం. మొహమాటస్తుడు. ఆయనకి ఎలా అలవడిందో ఈ ఒక్క కారా కిళ్ళీ తప్ప ఇంకే వ్యసనమూ లేదు. మళ్ళీ కారాకిళ్ళీ మాటెత్తకుండా వేళకి మందులు, పళ్ళ రసాలూ అందించే కోడళ్ళ పర్యవేక్షణలో కాలం గడవసాగాడు. పువ్వులా చూసుకుంటున్నారాయన్ని.

నెలరోజులు గడిచింది. నెల క్రితం చూసిన వాళ్ళు ఇప్పుడు చూస్తే ముక్కుమీద వేలేసుకుంటున్నారు. అంతగా చిక్కిపోయాడు. డాక్టరు వచ్చి ఇంకొన్ని మందులు రాసిచ్చి, రహస్యంగా గానీ కారా కిళ్ళీ వేసుకుంటున్నాడేమో అని అనుమానం వ్యక్తపరిచాడు. కోడళ్ళు, కొడుకులూ గట్టిగా చెప్పారు అటువంటిదేమీ లేదని.

ఇంకోనెల గడిచింది. ఈసారి డాక్టరుతో పాటు లాయరూ వచ్చాడు ముసలాయన కొనవూపిరితో వున్నాడు.

వచ్చే కాలం చూడండి!

పోయిన కాలమ్ తరువాయి: ఆస్తి పంపకాలయాయి. ఇంక ఐదు నిముషాలు– అంతే అని చెప్పేశాడు డాక్టరు. అంతా మంచం చుట్టూ చేరారు. ముసలాయన కళ్ళు అందర్నీ నిస్తేజంగా చూశాయి. కొడుకులూ, కూతుళ్ళూ, కోడళ్ళూ మనవలూ, మనవరాండ్రు.

అరగంటయింది. రెండుగంట లయింది, సాయంత్రమయింది ప్రాణంపోవటంలేదు. ఎవరో పెద్దాయన చెప్పాడు.... "అందరూ దగ్గరున్నారా! లేక రావలసిన వాళ్ళెవరయినా రావాలా? ప్రాణం పోవటంలేదు. బంధువులందర్నీ లెక్కపెట్టారు– అంతా వున్నారు. మరింకెవరికోసం ముసలాయన ఎదురుతెన్నులు.

ముసలాయన విధవప్పగారికి తట్టింది. "తమ్ముడికి చిన్నప్పటి నుంచి కారా కిళ్ళీ అంటే ప్రాణం. ఈ మాయదారి జబ్బొచ్చిన దగ్గర్నుంచీ తినడమే మానేశాడు" అని రాగాలుతీసింది.

పెద్దకొడుకు డాక్టర్‌ని సంప్రదించాడు. ఆయనకి ఇటువంటి సెంటిమెంట్ల మీద నమ్మకంలేదు. సరే కాని ఎలాగూ పోయే ప్రాణం. నా డ్యూటీ రోగిప్రాణం పోయే దాకానే కదా అనుకుని అభ్యంతరపెట్టలేదు.

నౌఖరు పరుగెత్తుకెళ్ళి ఘుమఘుమలాడేటట్లు స్పెషల్‌గా 'కారాకిళ్ళీ' కట్టించితెచ్చాడు పెద్దయ్యగారికి ఆఖరి కిళ్ళీ ఇదేగదా అని కళ్ళొత్తుకుంటూ.

పెద్ద కొడుకు తండ్రి చెవిలో మెల్లగా నాన్నా అని పిలిచాడు. నెమ్మదిగా కళ్ళు తెరచుకున్నై. వెంటనే ఆయన చూసేలోగా కళ్ళముందు పెట్టి గోరుతో ఓ పక్క చిన్న రంధ్రం చేసి నోటి దగ్గర పెట్టారు. తులసి తీర్థానికి కూడా తెరుచుకోని నోరు నెమ్మదిగా తెరుచుకుంది. కిళ్ళీ నోట్లో పెట్టారు.

వెంటనే కళ్ళు మూతపడ్డయ్.

నిమిషం తర్వాత దవడలు నెమ్మదిగా కదిలాయి,

మెల్లగా చప్పరిస్తున్నాడు.

రసం గొంతులోకి వెళ్ళాక గుటక వేశాడు.

ప్రాణం లేచొచ్చినట్లయింది.

మొహంలోకి కళాకాంతులు తిరిగి వచ్చాయ్.

అంతే.. ఆ తర్వాత కలకాలమ్ హాయిగా బతికాడాయన–కారాకిళ్ళీలు నవుల్తూ. ★